
సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



అప్రమత్తతే ఆయుధం
వర్షాభావ పరిస్థితుల వల్ల ఉద్యాన పంటలకు తెగుళ్లు ఆశిస్తున్నాయి.రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐజే మైఖెల్ రాజీవ్ తెలిపారు. -8లో



ట్రిపుల్ ఐటీలో కొండ చిలువ
ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో గురువారం బాయ్స్ హాస్టల్-2లోకి భారీ కొండ చిలువ వచ్చింది. మంచం కింద దూరి ఉండటం విద్యార్థులు గమనించారు. -8లో

గరిష్టం/కనిష్టం
31.3 /20.8

వాతావరణం
జిల్లాలో గురువారం 20.8 - 31.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సచివాలయం పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర అధికారుల బృందం

చెన్నూరు: కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్ శిక్షణ అధికారుల బృందం సభ్యులు గురువారం మండలంలోని బయన పల్లె గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏయే సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సభ్యులు రోహిత్, భరత్ బ్రిజేష్ ,సతీష్, రోహిత్, వీరితోపాటు డీఎల్‌పీఓలు మస్తాన్ వలి, బద్వేల్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుస్తున్న పసుపు ధర

కడప అగ్రికల్చర్: పసుపు ధర మెరుస్తోంది. గత కొద్ది రోజులుగా క్వింటా రూ. 10 వేలు పైనే పలుకుతోంది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కడప మార్కెట్ యార్డులో క్వింటా ఫింగర్ పసుపు అత్యల్ప ధర 9289 ఉండగా అత్యధికం రూ. 10489 పలికింది. బల్బు రకం అత్యల్ప ధర క్వింటా రూ. 6445, అత్యధిక రూ. 10389 పలికింది.

రైళ్లు దారి మళ్లింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: పూణె-కన్యాకుమారి-పుణె (16381/82) మధ్య నడుస్తున్న జయంతి జనతా ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు దారి మళ్లించారన్నారు. పాకాల, ధర్మవరం, గుత్తిమీదుగా వెళుతుందన్నారు. ముద్దనూరు-కలమల్ల రైల్వే మార్గంలో రైల్వే కారిడార్ పనులు జరుగుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.
- మధురై-ఓకా (09519) వారాంతపు రైలును ఈనెల 24వ తేదీ వరకు దారి మళ్లించారన్నారు. రైల్వే కారిడార్ పనుల వల్ల కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా నడుస్తుందన్నారు.
- తిరుపతి-రేణిగుంట మార్గంలో రోలింగ్ కారిడార్ పనులు జరుగుతున్న కారణంగా కడప-అర్కోణం-కడప (06401/402) అర్కోణం ప్యాసింజర్ రైలు మరో వారం రోజులపాటు రద్దు చేసినట్లు జనార్దన్ తెలిపారు.

18న ప్రత్యేక సమావేశం

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష 2024-25, 2025-26 వార్షిక ప్రణాళిక తయారీ చేసే విషయంపై ఈనెల 18వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లుగా డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. కడప శంకరాపురం జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ మీటింగ్ హాల్‌లో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతందన్నారు. ప్రతి మండలం నుంచి ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, ఎంఆర్‌జీ, సీఆర్‌పీలు హాజరుకావాలని సూచించారు.

రాయచోటిలో అనసూయ సందడి



షాపింగ్ మాల్‌లో రంగు రంగుల చీరలతో సందడి చేస్తున్న యాంకర్ అనసూయ

రాయచోటి: పట్టణంలోని ఎంజీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో యాంకర్ అనసూయ సందడి చేశారు. రాయచోటిలో గురువారం ఎంజీఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ ఎదుట ప్రదర్శన చేసి ప్రజలను ఆకట్టుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాయచోటిలో ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనసూయను చూసేందుకు పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు.
- అన్నమయ్య జిల్లా కేంద్రంలో షాపింగ్ మాల్ ఏర్పాటు కావడం హర్షనీయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

డిసెంబర్ 2న మెగా జాబ్ మేళా

రాయచోటిటౌన్: డిసెంబర్ 2వ తేదీన రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో రాయలసీమ జోన్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం రాయచోటి జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో కలసి విలేకరులతో మాట్లాడారు. రాయచోటి ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేవని కేవలం విద్య ద్వారానే ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలస వెళుతున్నారన్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 2న పది వేల మందికి ఉద్యోగ అవకాశం కలిప్పించే విధంగా రీజనల్ స్థాయి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చిరుధాన్యాలకు మద్దతు

- రైతుల నుంచి సేకరణకు పౌరసరఫరాలశాఖ సన్నాహాలు
- జనవరి నుంచి కొనుగోలు ప్రారంభం

కడప అగ్రికల్చర్: రైతులకు, ప్రజలకు ప్రయోజనం అందించడమే అజెండగా ప్రభుత్వం ముందుకు వెళతోంది.అన్నదాతలకు తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేసి ఆర్థికంగా ఆదాయం కల్పించడం.. అదే క్రమంలో పేద ప్రజల ఆర్యోగం కోసం పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చిరుధాన్యాలను మద్దతు ధరతో నేరుగా రైతుల నుంచి జిల్లా పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేయనుంది. ఈ మేరకు వివరాలను వ్యవసాయశాఖ ద్వారా సేకరించి జనవరి మొదటి వారం నుంచి కొనుగోలుకు పౌరసరఫరా సంస్థ సన్నాహాలను చేస్తోంది.
- చిరుధాన్యాలు ఒకప్పుడు పేదలు, మధ్యతరగతి ప్రజల ప్రధాన ఆహారం. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకు వీటి వినియోగం ఎక్కువగానే ఉండేది. కానీ నేడు పరిస్థితి మారింది. ఉరుకులు, పరుగుల జీవితం ఆధునిక పోకడలు.. నిత్యం పని ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారు. బిజీగా గడుపుతూ వేళ కాని వేళ దొరికిన జంక్‌ఫుడ్ తినడానికి అలవాటు పడి జీవన పంథాను మార్చుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనాలు రోగాల బారిన పడుతున్నారు.దీంతో పోషకాలు ఉన్న చిరు. ధాన్యాలను తినేందుకు ఆసక్తి చూపుతున్నారు.అలాగే చిరుధాన్యాల సాగును ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది.

మద్దతు ధరతో కొనుగోలు...
ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో చిరుధాన్యాలను కొనుగోలు చేయనున్నారు. ఇందులో జొన్నలు క్వింటా రూ. 3225, రాగులు 3846, కొర్రలు రూ. 2500లతో పౌరసరఫరాల సంస్థ నేరుగా కొనుగోలు చేయనుంది. జిల్లాలో ఏమేరకు చిరుధాన్యాల పంట సాగైంది. ఎంత విస్తీర్ణంలో సాగైంది., మేమేరకు దిగుబడి వస్తుందనే వివరాలను వ్యవసాయశాఖ నుంచి సేకరించింది. జనవరి మొదటి వారం నుంచి ఈ క్రాప్ ఆధారంగా చిరుధాన్యాల కొనుగోలును ప్రారంభించనుంది.



సాగులో ఉన్న కొర్ర

జిల్లాలో 4360 హెక్టార్లలో చిరుదాన్యాల సాగు



జిల్లాలో ఖరీప్ సీజన్‌కు సంబంధించి 4360 హెక్టార్లలో చిరుధాన్యం పంటలైన జొన్న, కొర్ర, రాగి సాగు చేశారు. 4058 హెక్టార్లలో జొన్న, 298 హెక్టార్లలో కొర్ర, 4 హెక్టార్లలో రాగి సాగుచేశారు. వీటన్నింటికి సంబంధించి 3117 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రైతులకు ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా నేరుగా వారి పొలాల వద్దకే పౌరసరఫరా సంస్థ అధికారులు వెళ్లి పంటను కొనుగోలు చేయనున్నారు. రైతులకు రవాణా సమస్య కూడా లేకుండా ప్రభుత్వమే ఖర్చులు చెల్లించనుంది.



ఈ క్రాప్ ఆధారంగా కొనుగోలు
చిరుధాన్యాలైన జొన్నలు, కొర్రలు, రాగులను జనవరి మొదటివారం నుంచి కొనుగోలు చేస్తాం. ఈ క్రాపు ఆధారంగా మాత్రమే కొనుగోలు చేస్తాం.
- అర్జునరావు, పౌరుసరఫరాలశాఖ, జిల్లా మేనేజర్

వివరాలను అందించాం...



చిరుధాన్యాల సాగు, దిగుబడులకు సంబంధించిన వివరాలను పౌర సరఫరాలశాఖకు అందించాం. వారు అర్హులైన రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తారు. చిరుధాన్యాలు సాగు చేసిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

రహదారులు, బ్రిడ్జి పనులకు అనుమతి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో 32 గ్రామీణ రహదారులు, 9 లాంగ్ స్పాన్ బ్రిడ్జెస్ నిర్మాణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చింది. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌శాఖ ఈ మేరకు జీఓఆర్‌టీ నంబరు 788 జారీ చేసింది. జిల్లాలో 247.24 కిలోమీటర్ల పొడవుతో 32 గ్రామీణ రహదారులు నిర్మిస్తున్నామని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎంఓఆర్‌డీ కింద ఇందుకోసం రూ. 6925.39 లక్షలు ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ. 4661.43 లక్షలు విడుదల చేస్తుందన్నారు. రహదారులను ఐదు సంవత్సరాలపాటు నిర్వహణ చేసేందుకు రూ. 754.97 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. ఇలా రహదారి పనులకు మొత్తం రూ. 11586.82 లక్షలు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో తొమ్మిది లాంగ్‌స్పాన్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇందులో ఎంఓఆర్‌డీ కింద రూ. 3428.03 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5717.97 లక్షలు వెరసి బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 9146 లక్షలు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో మెయింటెన్స్ కింద రూ. 251.52 లక్షలు కేటాయించారని వివరించారు.

సామాజిక సాధికార బస్సుయాత్రను
విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈనెల 23వ తేదీ నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత ఇచ్చి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇవ్వడంతోపాటు నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో ఆయా వర్గాలకు రిజర్వేషన్ కల్పించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎక్కువ మేలు జరిగిందన్నారు. దీనిని ప్రజలందరికీ వివరించడానికే సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ బస్సుయాత్రలో పదివేల మందికి తక్కువ కాకుండా ప్రజలు పాల్గొనేలా కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కృషి చేయాలన్నారు. 23వ తేదీ మధ్యాహ్నం రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్ నుంచి బస్సుయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పాతబస్టాండు, ఏడురోడ్ల కూడలి మీదుగా పాత కలెక్టరేట్ వద్దకు చేరి అక్కడ ముఖ్య అతిథులు ప్రసంగిస్తారన్నారు. బస్సుయాత్రకు ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, సినీ నటుడు అలీ, మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, ఏపీ వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మెన్ కరిముల్లా, టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జిల్లా కోశాధికారి హఫీజుల్లా, డా. సొహైల్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేయాలి

- కడప నగరపాలక సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ల డిమాండ్
- సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్న డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యేలు



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మేయర్ కె.సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. గురువారం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్ ఈ అంశంపై మాట్లాడుతూ కరోనా లాక్‌డౌన్ సమయంలో స్పెషల్ ఆఫీసర్ పాలనలో ప్రజాప్రతినిధులు, స్టేక్ హోల్డర్స్‌తో ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా మాస్టర్‌ప్లాన్ రూపొందించారన్నారు. గత సమావేశంలో ఈ అంశంపై అభ్యంతరాలు లేవనెత్తగా కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కలిప్తామని చెప్పారన్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం, మేయర్, కమిషనర్ ఎవరూ లేని సమయంలో సమావేశం జరిపారని తెలిపారు. గుట్టు చప్పుడు కాకుండా మాస్టర్‌ప్లాన్‌ను ఎందుకు ఆమోదించారని, ఇందులో ఏమైనా అవకతవకలు జరిగాయా అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుత మాస్టర్ ప్లాన్ అమలైతే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ దశలో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ మాస్టర్ ప్లాన్ రూపొందించేటప్పుడు ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని, స్థలాలు, భూముల క్లాసిఫికేషన్ సక్రమంగా ఉందా లేదా సరిచూడాలన్నారు. ఈ విషయాన్ని తాము ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని చెప్పారు. దీనిపై కమిషనర్ ప్రవీణ్‌చంద్ సమాధానమిస్తూ మాస్టర్‌ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించిందని, ఎవరికైనా అభ్యంతరాలుంటే క్లాసిఫికేషన్ మార్చాలని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు.
- మూడేళ్లకోసారి ప్లాన్ రెన్యువల్ చేసుకోవాలనే విషయం ప్రజలకు తెలియదని, ప్లాన్ లేకుండా కట్టిన నిర్మాణాలకు కాకుండా మొత్తం భవనానికి ఇంప్రూవ్‌మెంట్ ట్యాక్స్ వేసి పెనాల్టీ విధించడం సరికాదని కార్పొరేటర్ పాకా సురేష్ అన్నారు.
- మద్రాసు రోడ్డులో మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్ ప్రక్కనున్న వక్ఫ్ బోర్డు స్థల వివాదం హైకోర్టులో నడుస్తుండగా, సచివాలయ సిబ్బంది వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్(వీఎల్‌టీ) వేశారని 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు తెలిపారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ ప్రభుత్వ స్థలానికి వీఎల్‌టీ ఎలా వేస్తారని, దీనివల్ల వారు తమకు హక్కు ఉందని కోర్టుకు పోయే అవకాశం ఉందన్నారు. కమిషనర్ సమాధానమిస్తూ 2016లోనే దానికి వీఎల్‌టీ వేశారని వివరణ ఇచ్చారు.
- తమ డివిజన్‌లో క్లాప్ వాహనాలకు డ్రైవర్లు లేరని కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి తెలుపగా, చిన్న, చిన్న సందుల్లోకి క్లాప్ వాహనాలు రావడం లేదని, ప్రత్యామ్నాయం చూపాలని మరో కార్పొరేటర్ అరీపుల్లా బాషా కోరారు.
- అంబేద్కర్ సర్కిల్- వై జంక్షన్ మార్గంలో రోడ్లు, భవనాలశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని 13వ డివిజన్ కార్పొరేటర్ రామలక్ష్మిరెడ్డి ఆరోపించారు.
- కడప వ్యవసాయ మార్కెట్ యార్డు, అన్నమయ్య సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిళ్లను పెద్దవిగా నిర్మిస్తున్నారని, దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు పెరిగే అవకాశం ఉందని కో ఆప్షన్ సభ్యుడు జహీర్, కార్పొరేటర్ షఫీ అన్నారు.
- దేవునికడపలో భక్తుల కోసంటాయ్‌లెట్లు నిర్మించాలని 2వ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి కోరారు. మరియాపురం సర్కిల్‌లో క్రైస్తవ నమూనాను ఏర్పాటు చేయాలని 14వ డివిజన్ కార్పొరేటర్‌బాబు కోరారు. ఇందిరానగర్‌లో ప్రభుత్వ స్థలాలపై దొంగ పత్రాలు సృష్టించి అమ్ముకుంటున్నారని 16వ డివిజన్ కార్పొరేటర్ బి.లక్ష్మిదేవి చెప్పారు.కడపలో పిల్లర్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని 10వ డివిజన్ కార్పొరే టర్ మల్లికార్జున కోరారు. దీనిపై సమాధానం ఇచ్చేందుకు ఏపీఎస్ పీడీసీఎల్ అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో మేయర్, డిప్యూటీ సీఎం అసహనం వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, నిత్యానందరెడ్డి, డిప్యూటీ క మిషనర్ రమణారెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటిరెడ్డి,చెన్నయ్య పాల్గొన్నారు.

కౌన్సిల్ హాల్ ప్రారంభం



కౌన్సిల్ హాలుకు మరమ్మతులు చేస్తున్న వర్కర్లు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌ను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, కమిషనర్ ప్రవీణ్‌చంద్‌లు గురువారం ప్రారంభించారు. చాలారోజులుగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి గురువారం ఉదయం 11 గంటలకల్లా పూర్తి చేశారు. మేయర్, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ప్రత్యేక కుర్చీలు..వారి ముందు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కౌన్సిల్ హాల్ అంతా సెంట్రల్ ఏసీ చేసి, మరుగుదొడ్లకు కూడా మరమ్మతులు చేశారు. కార్పొరేటర్ల కుర్చీలను క్రమపద్ధతిలో అమర్చి, వారి వెనుక అధికారులు, ప్రెస్‌కు ప్లాస్టిక్ కుర్చీలు ఏర్పాటు చేశారు.


కడపలో కనీ వినీ ఎరుగని అభివృద్ధి: మేయర్
కడప నగరంలో ఇదివరకు కనీ వినీ ఎరుగని అభివృద్ధి జరుగుతోందని మేయర్ సురేష్ బాబు అన్నారు. 70 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా రూ.1500 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. రూ.450 కోట్లతో కడపకు శాశ్వత మంచినీటి పథకాన్ని తీసుకురాబోతున్నారని, ఇందుకు బ్రహ్మంసాగర్‌లో 2 టీఎంసీల నీటిని కేటాయించారని గుర్తు చేశారు. రూ.250కోట్లతో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మానసిక వైద్యశాల, కేన్సర్ ఆసుపత్రుల నిర్మాణం సాగుతోందన్నారు. వీటిని డిసెంబర్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి జాతికి అంకితమిస్తామని తెలిపారు.

దేశంలో తొలిసారి రాష్ట్రంలో బీసీ జన గణన: డిప్యూటీ సీఎం



దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో బీసీ జన గణన చేయబోతున్నామని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. ఈ జన గణన పూర్తయితే జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ పథకాలు ఆయా వర్గాలకు అందుతాయన్నారు. ఎవరికైనా కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోతే వెంటనే ఇచ్చే ఏర్పాటు చేయాలని సూచించారు. క్లీన్ కడప కార్యక్రమం అమలుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు.

లే ఔట్లను కమిషనర్ పరిధిలోకి తేవాలి: ఎమ్మెల్యే



కడపలోని ఇందిరా నగర్, చెర్లోపల్లి, వైఎస్సార్‌నగర్, లే ఔట్లను మున్సిపల్ కమిషనర్ పరిధిలోకి తేవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ పరిధిలో ఉండటం వల్ల ఆక్రమణలు పెరిగిపోతున్నాయన్నారు.

ఊటుకూరు చెరువును అభివృద్ధి చేయాలి: ఎమ్మెల్సీ



ఊటుకూరు చెరువును కూడా అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కోరారు. చిత్తూరు-కర్నూల్ హైవేపై వరదనీరు నిలవకుండా సక్రమంగా పోయేలా కాలువలు నిర్మించాలని కోరారు.

బీసీ జనగణనలో పాల్గొనాలి: కమిషనర్
బీసీ జన గణనలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్ కోరారు. మొబైల్ యాప్‌లో డేటా పొందుపరచాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 14 నుంచి జరిగే 'ఆడుదాం ఆంధ్రా'కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎన్నికల విధులు బాధ్యతగా చేపట్టాలి

నోడల్ అధికారులకు కలెక్టర్ విజయరామరాజు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: రానున్న సాధారణ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా, బాధ్యతగా నిర్వహించాలని కలెక్టర్ విజయరామరాజు నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, సన్నద్ధతపై నియమితులైన సంబందిత నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు -2024 నిర్వహణలో భాగంగా జిల్లా స్థాయిలో వివిధ కార్యకలాపాలు నిర్వర్తించేందుకు పలు శాఖలకు చెందిన వారిని నోడల్ అధికారులుగా నియమించి వారికి విధులను కేటాయించినట్లు చెప్పారు. విధులను బాధ్యతగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మ్యాన్ పవర్ నిర్వహణకు సంబంధించి సీపీవో, డీఐఓలకు పర్యవేక్షణ బాధ్యతలను, ట్రెనింగ్ మేనేజ్‌మెట్ (శిక్షణ నిర్వహణ) కు సంబంధించి పీబీసీ-ఎంఆర్సీ ఎస్డీసీ, ఏపీసీ ఎస్.ఎస్., ఏడీ డిసేబుల్డ్ వెల్ఫేర్, డీఈవోలకు విధులను కేటాయించారు. కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, ఏఎస్పీ తుషార్ డూడి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్వో గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నాం
ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితాను సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. గురువారం సీఈఓ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. 18-19 ఏళ్ల యువతను ఓటర్లుగా నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటివరకు 11,823 మంది యువ ఓటర్లను నమోదు చేశామని పేర్కొన్నారు. డూప్లికేట్ ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, మరణించిన వారు, కొత్తగా వివాహమై వేరే ఊర్లకు వెళ్లిన వారు, పునరావృతం అయిన పేర్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫారం -6, 7, 8 పెండెన్సీలపై, గ్రీవెన్స్‌ల పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి

- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం కడపలోని జోనల్ వర్క్‌షాప్‌లో 8 జిల్లాల అకౌంట్స్ ఆఫీసర్లు, ఇన్‌చార్జిలకు సీఎల్ఎస్ ఫైనాన్స్ మోడల్ ఇంప్లిమెంటేషన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, అందుకు తగ్గట్టుగా ప్రతి ఉద్యోగి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

జనవాక్కు

సొంతిల్లు వచ్చింది



గతంలో నాకు మట్టి మిద్దె ఉండేది. వర్షం వస్తే ఇంటిలో ఉండే పరిస్థితి లేదు. చాలా ఇబ్బందులు పడేవారం. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇల్లు మంజూరు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నాం.

– బచ్చు శ్యామల, గాడెగూడూరు, రాజుపాళెం మండలం

ఫేస్‌యాప్ శుభపరిణామం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులు సరైన సమయానికి పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు మంచి విద్యా బోధన చేయాలన్న లక్ష్యంతో ఫేస్ యాప్ ఏర్పాటు చేశారు. అలాగే నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. బడుల రూపు రేఖలు మారడంతో ఉపాధ్యాయులు కూడా ఉత్సాహంగా వెళుతున్నారు. గతంలో పాఠశాలలు అస్తవ్యస్తంగా ఉండేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఫేస్ యాప్, నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయడం శుభపరిణామం.

– వెంకటనాథరెడ్డి, ఉపాధ్యాయుడు, పులివెందుల

కుల ధ్రువీకరణ పత్రం ఊర్లోనే వచ్చింది



వైఎస్సార్ చేయూత పథకం కోసం గ్రామ సచివాలయంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాను. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్కరోజులో సర్టిఫికెట్ చేతికి వచ్చింది. గత ఏడాది ఈ సర్టిఫికెట్ కోసం చాపాడు మండలానికి వారం రోజులు తిరిగినా రాలేదు. అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా మా ఊర్లోనే సర్టిఫికెట్ ఇచ్చారు. ఇది జగనన్న చేసిన మేలు. నాకెంతో సంతోషంగా ఉంది.

– గొడుగు జ్యోతి, అల్లాడుపల్లె, చాపాడు మండలం

రేషన్‌కార్డు వచ్చింది



టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కోసం నిత్యం తహసీల్దార్ కార్యాలయానికి కాళ్లు అరిగేలా తిరిగాం. అయిన రేషన్ కార్డు రాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే మా కుటుంబంలోని ముగ్గురికి రేషన్ కార్డులతో పాటు, ఇంటి స్థలాలు, పక్కా గృహం మంజూరైంది. అలాగే మా బిడ్డలకు అమ్మ ఒడి పథకం అందడంతో పాటు బడిలో పౌష్టికాహారం ఇస్తున్నారు. మా భర్తకు వాహన మిత్ర లబ్ధి కూడా అందుతోంది. దీంతో మేము ఆర్థికంగా నిలదొక్కుకున్నాం.

– కత్తి లక్ష్మిదేవి, బుగ్గలేటిపల్లె, చింతకొమ్మదిన్నె మండలం

తెగుళ్ల కాలం.. అప్రమత్తతే ఆయుధం

గత రెండు నెలలుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వలన ఉద్యాన పంటలు ఆశించిన మేర ఎదుగదల లేవని దీంతో పాటు తెగుళ్లు ఆశిస్తున్నాయని వైఎస్సార్ జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐజే మైఖేల్ రాజీవ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. – కడప అగ్రికల్చర్





మిరపపంట..

ఈ ఏడాది మిరపపంట నాటిన తొలిదశలోనే బెట్టుకు గురైంది. దీంతో మిరపపంట ఆశించిన మేర పెరగలేదు. దీంతోపాటు అంతర్‌కృషిగా ఎరువులు వేసేందుకు పరిస్థితులు అనుకూలించడం లేదు. ఈ వర్షాభావ పరిస్థితుల(బెట్టు) వలన రసం పీల్చు పురుగులైన తామర పురుగు, తెల్లదోమ ఉధృతి అధికంగా ఉంది. దీంతో వైరస్ తెగులు అధికంగా వ్యాప్తి చెందుతుంది.

- ఈ బెట్టు పరిస్థితులలో మొక్కలు భూమి నుంచి పోషకాలు తీసుకోలేవు. ఈ పరిస్థితిని అధిగమించి మిరప మొక్కలు ఎదుగుదల పెంచేందుకు యూరియా 10–20 గ్రాములు/పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు/స్థూల పోషకాల మిశ్రమం (19–19–19) 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి వారం రోజులకు ఒక్కసారి పిచికారి చేసి మొక్కలకు కావాల్సిన పోషకాలు అందించాలి. అలాగే సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే సూక్ష్మ పోషకాల లోపాలను సవరించవచ్చు. తద్వారా దృఢంగా, ఆరోగ్యవంతంగా పెరిగిన మొక్కలు
- రసం పీల్చు పురుగుల ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులును తట్టుకొనే శక్తిని కలిగి ఉంటాయి.
- మొక్కల వరుసల మధ్య గొర్రు వేసి గుంటకలతో నేలను చదువు చేసి నేలలో తేమ ఆరిపోకుండా చూడాలి
- ఏదైనా సందర్భంలో వర్షం పడినట్లయితే వెంటనే పైపాటుగా ఎకరానికి 65 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. అదే విధంగా నీటి వసతి అందుబాటులో ఉన్నప్పుడు కూడా పైన తెలిపిన ఎరువులను నాటిన 90 రోజులకు ఒకసారి, 120 రోజులకు ఒకసారి వేసుకోవాలి
- ప్రస్తుత బెట్ట పరిస్థితులలో రసం పీల్చు పురుగులైన తామర, తెల్లదోమ పురుగులతో పాటు గత రెండు సంవత్సరాలుగా మిరప పంటను నష్టపరుస్తున్న నల్లతామర పురుగు కూడా ఆశించేందుకు అవకాశం ఉంది.
- నల్లతామర పురుగులు ఆకుల మీద, పువ్వులలో ఎక్కువ సంఖ్యలో చేరి పత్ర హరితం గీకి వేయడం, రసం పీల్చడం ద్వారా కణజాలం దెబ్బతింటుంది. దీంతో ఆకులు మాడిపోయినట్లు కనిపించడం, పువ్వులు గోధుమ రంగులోకి మారి రాలిపోవడం జరుగుతుంది. పిల్ల పురుగులు కాయ తయారయ్యే దశలో ఎక్కువగా లేతకాయల మీద ఆశించి రసం పీల్చడం ద్వారా కాయలు గట్టిగా గిడసబారి ఇటుకరాయి రంగులోకి మారిపోతాయి.
- రైతులు సామూహికంగా నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 40–50 వరకు, పసుపురంగు అట్టలను ఎకరానికి 10–20 వరకు మొక్క ఎత్తుకు దగ్గరగా పెట్టుకోవడం ద్వారా నల్లతామర పురుగు, తెల్లదోల ఉధృతిని తెలుసుకుని సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టవచ్చు.
- వేప నూనెను సిఫారసు చేసిన ఇతర మందులతో కూడా కలిపి పిచికారీ చేసుకోవచ్చు.
- విచక్షణారహితంగా తక్కువ వ్యవధిలో సిఫారసు చేయని పురుగు మందులను వాడరాదు
- తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రిడ్ 0.3 గ్రాములు/ థయోమిథాక్సమ్ 0.4 గ్రాములు/ డైఫెన్ థియోరాన్ 1.25 గ్రాములు/ స్పైరోమెసిఫెన్ 1 మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి
- నల్లతామర పురుగు నివారణకు ఎకరానికి బ్రోఫ్లనిలైడ్ (20 ఎ.సి) 34 మిల్లీలీటర్లు/ ఫ్లక్సామెటామైడ్ (20 ఎ.సి) 160 మిల్లీలీటర్లు/ ఐసోసైక్లోసెరం 240 మిల్లీలీటర్లు/ పిప్రోనిల్ (80 డబ్ల్యూజీ) 40 గ్రాములు / ఫిప్రోనిల్ 5 శాతం ఎస్‌సి 400 మిల్లీలీటర్లు/స్పైరోటెట్రామాట్ (15.30 శాతం జీడీ) 200 మిల్లీలీటర్లు/ థయోమిథాక్సమ్ 80 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలి.
- అవసరాన్ని బట్టి పైన సూచించిన పురుగు మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకుని పురుగుల ఉధృతిని అదుపులో ఉంచుకోవాలి.
- ఈ జాగ్రత్తలు పాటించి మొక్కలను 20 నుంచి 25 రోజుల వరకు బెట్టు నుంచి కాపాడుకోవచ్చు.

ఉల్లి పంటకు...

- బెట్టు పరిస్థితులలో పంట ఎదుగుదల సరిగా లేనట్లయితే నీటిలో కలిగే ఎన్‌పీకే ఎరువులు 19–19–19 ఎన్‌పీకే 5 గ్రాములు ఒక నీటరు నీటికి లేదా 13–00–45 5 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా యూరియా 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- మొక్కలు ఏపుగా పెరిగే దశలో త్వరగా కోలుకోవడానికి సల్ఫర్ 85 శాతం డబ్ల్యూపీ : 1.5–2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి ఆకుల మీద పిచికారీ చేయాలి.
- అధిక ఉష్ణోగ్రత సమయంలో లీఫ్ మైనర్‌ను నియంత్రించడానికి వేప సబ్బు 4 గ్రాములు లీటరు లేదా ఎసిటామిప్రిడ్ 0.5 గ్రాములు లీటరు చొప్పున పిచికారీ చేయాలి.

చీనీ, నిమ్మ...

- చీనీ నిమ్మ తోటలో సున్నితమైన పూత– పిందె దశ మరియు కాయ పెరిగే దశలతో తప్పని సరిగా నీటిని అందించినట్లయితే కాయ దిగుబడి తగ్గకుండా పంటను కాపాడుకోవచ్చు.
- పిందె రాలడాన్ని నివారించడానికి 2.4–డి : 1 గ్రాము లేదా ప్లానోఫిక్స్ : 25 మిల్లీలీటరు హార్మోను మందును 100 లీటర్ల నీటిలో కలిపి బఠాని సైజు పిందె దశలో ఒకసారి, గోలీ కాయ దశలో మరోసారి చివరగా కాయ కోతకు ఒక నెల రోజుల ముందు ఒకసారి పిచికారీ చేసుకోవాలి.
- వర్షాభావ పరిస్థితులలో కాయ సైజు, జ్యూస్ శాతం పెంచడానికి పొటాషియం నైట్రేట్ (13–0–45) : 10 గ్రాములు లీటరు నీటికి కలిపి కాయ పెరిగే దశలో పిచికారీ చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సూచించారు.

ట్రిపుల్ ఐటీలో కొండ చిలువ



అటవీ ప్రాంతంలో వదిలిన కొండ చిలువ

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో కొండచిలువ కలకలం రేగింది. గురువారం బాయ్స్ హాస్టల్–2లోకి భారీ కొండ చిలువ వచ్చింది. మంచం కింద దూరి ఉండటం గమనించిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీ అధికారులకు తెలిపారు. వేంపల్లె ఫారెస్ట్ అధికారులకు ట్రిపుల్ ఐటీ అధికారులు సమాచారం ఇవ్వంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కొండ చిలువను గోనె సంచిలో బంధించారు. బంధించిన కొండ చిలువను ఫారెస్ట్ జీపులో దూరంగా ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేశారు. ఇటీవల ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ రోడ్డులో రెండు కొండ చిలువలు తారస పడటంతో స్థానికులు చంపిన విషయం అందరికి తెలిసిందే. ఇప్పుడు హాస్టల్ గదిలోకి రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



చాపాడు : మండలంలోని కుందూనది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. మండలంలోని నెర్రవాడ గ్రామానికి చెందిన పిట్టి పామయ్య అనే వ్యక్తికి చెందిన ఏపీ04 టీఎక్స్8881 నంబరు ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు దాడి నిర్వహించి పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, ఆటోలతో అధికారులు

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని గోపవరం పరిసరాలలో అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ చౌక బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం సాయంత్రం పట్టుకున్నారు. చెన్నూరు మండలం వేదాస్ స్కూల్ నుంచి గోపవరం గ్రామానికి వెళ్లే దారిలో చిలమకూరి పాపయ్య రేకుల షెడ్డులో రేషన్ బియ్యం అక్రమంగా నిలువ ఉంచినట్లు సమాచారం అందడంతో దాడి నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. 205 బస్తాలలో 100.60 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు వాహనాలు, తూకం మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ. 8,67,490 ఉంటుందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం

రాయచోటిటౌన్ : భర్త చేతిలో భార్య హత్యకు గురైన సంఘటన బుధవారం రాత్రి రాయచోటి పట్టణ శివార్లలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండలం గరుగుపల్లెకు చెందిన వెంకటరమణ వీరబల్లి మండలం మట్లి గ్రామానికి చెందిన రేవతి(25)ని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండు నెలల క్రితం నుంచి భార్యపై భర్తకు అనుమానం మొదలైంది. ఈ నేపథ్యంలో ఆమె భర్తతో విభేదించి పుట్టింటికి వెళ్లింది. బుధవారం రాత్రి ఆమెకు ఫోన్ చేసి మాట్లాడాలని సయోధ్యకు పిలిచాడు. ఆమెను బైకుపై తీసుకెళ్లి ఆమె చున్నీతోనే మెడకు గట్టిగా చుట్టి హత్య చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు



అనసూయాదేవి(ఫైల్)

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో అనసూయాదేవి అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌బాబు సమాచారం మేరకు అనసూయాదేవికి కొంత కాలంగా మతిస్థిమితం లేదు. ఈనెల 14వ తేదీన ఆమె భర్త రమణారెడ్డి కడపకు ఆసుపత్రికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో అతని భార్య కనిపించ లేదు. గురువారం వృద్ధురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నా కుమారుడిని అన్యాయంగా ఇరికించారు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 12న రాత్రి పాత బైపాస్ రోడ్డులో అమృత్ టీస్టాల్‌లో సాయికిరణ్ అనే యువకుడిని హత్య చేసిన సంఘటనలో తన కుమారుడు శ్రీరామ్‌ను అన్యాయంగా రెండవ నిందితుడిగా చేర్చారని అతని తల్లి సుభద్ర ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చావుబతుకుల మధ్య ఉన్న సాయికిరణ్‌ను తన కుమారుడు ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నించాడని తెలిపారు. అయితే ఈ హత్య కేసులో రెండవ నిందితుడిగా చేర్చడం అన్యాయమన్నారు. పోలీసులు పునః పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనపై చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డిని విలేకరులు వివరణ కోరగా, ఈ సంఘటనలో హత్యకు గురైన సాయికిరణ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ సంఘటనలో సరైన ఆధారాలను సేకరించిన తరువాతనే శ్రీరామ్‌ను రెండవ నిందితుడిగా చేర్చామన్నారు. ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మన్నికలో మేటి భారతి సిమెంట్



రామసముద్రంలో తాపీ మేస్త్రీలకు బీమా పత్రాలు అందజేస్తున్న టెక్నికల్ మేనేజర్, మార్కెటింగ్ ఆఫీసర్

రామసముద్రం : నాణ్యత మన్నికల్లో భారతి అల్ట్రాఫా సిమెంట్ మేటి అని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి, మార్కెటింగ్ ఆఫీసర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. రామసముద్రంలో తాపీ మేస్త్రీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ ప్రజల విశ్వాసాన్ని పొందిందని, అత్యాధునిక పరిజ్ఞానంతో తయారైన ఈ సిమెంట్ వాడకంతో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా సాగుతుందన్నారు. మిగిలిన సిమెంట్లతో పోలిస్తే భారతి సిమెంట్ తక్కువ సమయంలో సెట్టింగ్ పూర్తవుతుందన్నారు. వినియోగదారులకు సాంకేతిక సాయాన్ని, బీమా పత్రాలను తమ సంస్థ ఉచితంగా అందజేస్తుందని పేర్కొన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయలు ఉచిత బీమా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు భాస్కర్‌గౌడ్, మధు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అదృశ్యమైన మూడురోజుల తర్వాత శవమయ్యాడు



వాగులో లభ్యమైన బాలకృష్ణ మృతదేహం

బి.కొత్తకోట : మోటార్లు రిపేరు చేసే మెకానిక్ మూడు రోజుల క్రితం అదృశ్యమై నాలుగోరోజు శవమై కనిపించాడు. గురువారం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు వివరాలు... బి.కొత్తకోట వాయలవంకకు చెందిన కె.బాలకృష్ణ(38), కె.శ్రీదేవి భార్యాభర్తలు. బాలకృష్ణ మెకానిక్‌గా పనిచేస్తుండగా, శ్రీదేవి ఆశావర్కర్‌గా విధులు నిర్వహిస్తోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా కుటుంబంలో చిన్నచిన్న గొడవలు చోటు చేసుకుంటున్నాయి. బాలకృష్ణ మద్యం సేవించడం, మెకానిక్ పని సక్రమంగా చేయకపోవడంతో విభేదాలు తలెత్తాయి. దీంతో ఈనెల 13న బాలకృష్ణ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ పరిస్థితుల్లో గురువారం ఉదయం బి.కొత్తకోట సమీపంలోని ఆలేరు వాగులో బోర్లా పడిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి బాలకృష్ణగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని భార్య శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలకృష్ణ సక్రమంగా పనిచేసేవాడు కాదని, మద్యం సేవిస్తూ గొడవపడేవాడని, చిన్న చిన్న కారణాలతో విభేదించేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారని ఏఎస్‌ఐ బొజ్జేనాయక్ చెప్పారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని ఏఎస్‌ఐ చెప్పారు. మృతిపై అనుమానాస్పద కేసు నమోదైంది. అదృశ్యమైన మృతుడు మూడురోజుల పాటు ఎక్కడున్నాడు? వాగులో పడి ఎలా చనిపోయాడు? వాగులో పడే ముందు ఏమైనా సంఘటనలు జరిగాయా? ఆ సమయంలో ఎవరైనా ఉన్నారా? ప్రమాదవశాత్తు వాగునీటిలో పడి మరణించాడా, లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న వివరాలు దర్యాప్తులో తెలుస్తాయని ఏఎస్‌ఐ చెప్పారు.